ప్రజాశక్తి
బుధవారం 28 డిసెంబర్ 2022

జాతీయ రహదారిపై పాదయాత్రగా వస్తున్న సిపిఎం నాయకులు

పేదలను పట్టించుకోని పాలన

- ఇళ్ల పట్టాలు, ఇళ్లు ఇవ్వలేని ప్రభుత్వం
- మాటలకే జగన్ హామీలు పరిమితం
- పది శాతం కూడా పూర్తవని ఇళ్ల నిర్మాణాలు
- సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
- గుత్తిలో సిపిఎం ఆధ్వర్యంలో 'పేదలపాదయాత్ర' ప్రారంభం

ప్రజాశక్తి-గుత్తి, పెద్దవడుగూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదలను పట్టించుకోకుండా పాలన సాగిస్తోందని, ఇప్పటికీ ఇళ్లు, ఇంటి పట్టాలు లేని పేదలే ఇందుకు ఉదాహరణ అని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. నిరుపేదలకు ఇళ్ల పట్టాలు, పక్కా గృహాల సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన 'పేదల పాదయాత్ర' మంగళవారం ఉదయం గుత్తిలో ప్రారంభం అయ్యింది. పట్టణంలోని గాంధీచౌక్ నుంచి ప్రారంభం అయిన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, రాజీవ్ సర్కిల్, అనంతపురం రోడ్డు మీదుగా సాగింది. మొదటి రోజు గుత్తి, మిడతూరు, గజరాంపల్లి మీదుగా రాత్రి పామిడికి చేరుకుంది. యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా తరలొచ్చి వారి సమస్యలను సిపిఎం నాయకుల వద్ద ఏకరువు పెట్టారు. పేదల కోసం చేపట్టిన ఈ యాత్ర విజయవంతం కావాలంటూ పలువురు ఆశీర్వదించారు. అంతకుముందు గుత్తి గాంధీచౌక్ వద్ద జరిగిన బహిరంగ సభలో నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు అమల్లో ఒక్కొక్కటిగా జారిపోతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఇంటి పట్టాలు, గృహాలు ఇవ్వలేదంటే ప్రభుత్వానికి పేదలపై ఎలాంటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సెంటు స్థలం ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం లక్ష కారణాలు చెబుతోందన్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ప్రస్తుతం పెరిగిన గృహ నిర్మాణ ముడిసరుకుల ధరలకు ఏ మూలకూ సరిపోదన్నారు. పేదల పక్షాన సిపిఎం పోరాటం సాగిస్తుందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 68 వేలు ఇళ్లు మంజూరు గాక వాటిలో ఇప్పటి వరకు పూర్తయినవి 6048 మాత్రమే అన్నారు. కనీసం పది శాతం నిర్మాణాలు కూడా పూర్తి కాని పరిస్థితి ఉందన్నారు. పెరిగిన ముడిసరుకుల ధరలు, ప్రభుత్వ నిబంధనలు, అనువుగాని చోట స్థలాలు ఇవ్వడం తదితర కారణాల వల్లనే నిర్మాణాలు ముందుకు సాగలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని జిల్లాలో 27 వేల సామూహిక గృహ ప్రవేశాలు చేస్తామని చెప్పిన మాటలు ఆచరణలో అమలుకు నోచుకోలేదన్నారు. గుత్తి పట్టణంలో 615 సర్వే నెంబర్‌లో పేదలకు అనుకూలంగా జిల్లా కోర్టు తీర్పు ఇచ్చినా అధికారులు ఇంటి పట్టాలు ఇవ్వలేదన్నారు. పేదల విషయంలో వైసిపి, టిడిపి రెండు పార్టీలూ ఒక్కటే అన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు సిపిఎం పోరాటం సాగిస్తుందన్నారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా 29న అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గుత్తిలో పాదయాత్రకు సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నాగేంద్రకుమార్, చంద్రశేఖర్ రెడ్డి, దాసరి శ్రీనివాసులు, బాలరంగయ్య, కృష్ణమూర్తి, సావిత్రి, సూర్యచంద్ర, గుత్తి నాయకులు రామకృష్ణ, నిర్మల, రేణుక, మల్లికార్జున, రమేష్, మున్నీ పాల్గొన్నారు.

పాదయాత్ర ప్రారంభం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

పాదయాత్రకు మిడుతూరులో ఘన స్వాగతం

పెద్దవడుగూరు : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద ఘన స్వాగతం లభించింది. యాత్రకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గద్దెనెక్కిన తర్వాత విస్మరించారన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు సిపిఎం ఆందోళనలు కొనసాగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నాగేంద్ర, చంద్రశేఖరరెడ్డి, దాసరి శ్రీనివాసులు, బాలరంగయ్య, కసాపురం రమేష్, సూర్యచంద్రుడు, నిర్మల, గుత్తి రమేష్, స్థానిక నాయకులు దస్తగిరి, ఈశ్వర్‌రెడ్డి, పెద్దయ్య, ఈశ్వరయ్య, బాష, అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి నుంచి పాదయాత్రగా వస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

పెద్దవడుగూరు మండలంలో పాదయాత్రకు మద్దతు తెలిపి ప్రసంగిస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగరాజు

పామిడిలో మాట్లాడుతున్న దాసరి శ్రీనివాసులు

'ఆరోగ్య అనంత'కు పురిటి కష్టాలు.!

◆ఫిర్యాదులోనూ సమస్యలు ◆ఇంకా తొలగని సాంకేతిక ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం చొరవతో చేపట్టిన 'ఆరోగ్య అనంతపురము' యాప్‌కు పురిటి కష్టాలు తప్పడం లేదు. ఇంకా పూర్తి స్థాయిలో సాంకేతిక సమస్యలు తొలగలేదు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టరు కేతన్ గార్గ్ సంయుక్త ఆలోచన రూపం ఆరోగ్య అనంతపురము. దీన్ని సోమవారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. 12 ప్రభుత్వ విభాగాల్లోని సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు అధికారులు, కార్యాలయాల వద్దకు రాకుండానే నేరుగా ఆన్‌లైన్‌లో ఆయా విభాగాధిపతుల దృష్టికి సమస్య తీసుకెళ్లేందుకు వీలుగా 'ఆరోగ్య అనంతపురము'పేరుతో ఒక యాప్‌ను రూపొందించారు. ఇది ప్రారంభమైన రోజే కొంత మంది దీని పనితీరును పరిశీలించే ప్రయత్నం చేశారు. అయితే సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ సమస్యలేమైనా ఉంటే తెలియజేసేందుకు వీలుగా ఒక నంబరునూ అందులో ఉంచారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే తన నంబరు అందులో ఉందా అని ఆశ్చర్యం వ్యక్తం చేయడం గమనార్హం. తనకు ఆ బాధ్యతలు

అప్పగించినట్టు కూడా తెలియదని చెప్పారు. ఇదేమిటని అడిగిన వ్యక్తే నివ్వెరపోయే పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆన్‌డ్రాయిడ్ ఫోన్ వరకు ఇది పనిచేస్తున్నప్పటికీ ఆపిల్ వంటి మొబైల్ ఫోన్లలో ఇది ఇంకా పనిచేసే పరిస్థితి లేదు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగలిగేది విద్యావంతులే ఉంటారు. విద్యావంతులు చాలా వరకు ఇప్పుడు సాంకేతిక బాగావున్న మొబైల్ ఫోన్నునే వాడుతుంటారు. అటువంటి వారు వీటికి ఇప్పుడు ఫిర్యాదు చేయడానికి వీల్లేకుండా ఉంది.

యాప్ లక్ష్యం ఉన్నతం

జిల్లా ఉన్నతాధికారులు ఒక మంచి లక్ష్యంతోనే ఈ యాప్‌ను రూపొందించారు. ప్రజలందరూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా సమస్యను నేరుగా సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌లోనే ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా రూపొందించారు. లాగిన్ కావడం తమ సమస్యను యాప్‌లోనే తీసుకెళ్లవచ్చు. దీన్ని నిర్ణీత సమయంలో పరిష్కరించే విధంగా ఆపై ఉన్నతాధికారుల సమీక్షలు ఉండనున్నాయి. దీంతో సోమవారం మాత్రమే స్పందన కార్యక్రమానికి వచ్చి ఇవ్వాలన్నది ఏమీ ఉండదు. ఈ మేరకు కొంత వరకైనా స్పందనలో ఒత్తిడి తగ్గే అవకాశముంటుంది. వ్యవసాయం, పశుసంవర్థక శాఖ, సివిల్ సప్లైయిస్, డిఆర్‌డిఎ, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, విద్య, ఆరోగ్యం, ఉద్యానవన శాఖ, ఐసిడిఎస్, కమర్షియల్ ట్యాక్సు, తూనికలు కొలతల శాఖలు మొత్తం 12 విభాగాలను సంబంధించిన ఫిర్యాదులను, సమస్యలను తెలియజేసేందుకు వీలుగా యాప్‌ను రూపొందించారు. ఇది కేవలం జిల్లా స్థాయి సమస్యలు మాత్రమే విన్నవించుకునే వీలుంటుంది. ఇది సక్సెస్ అయితే మరింత విస్తరించే అవకాశాలూ ఉండనున్నాయి. ప్రారంభంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు కొంత ఇబ్బందికరంగా మారాయి. వీటిని పరిష్కరించగలిగితే ప్రజలకు మరంత మెరుగైన సేవలందే అవకాశాలున్నాయి.

అర్హులందరికీ పథకాలు

నవరత్నాలు-ద్వైవార్షిక నగదు బదిలీ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో అర్హులై ఉండి వివిధ కారణాలతో పథకాల లబ్ధి పొందని 10,283 మందికి పది రకాల పథకాల ద్వారా రూ.18.09 కోట్ల రూపాయల చెక్కును మంగళవారం నాడు స్థానిక కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు అందజేశారు. దీంతో పాటు 2021 ఖరీఫ్‌లో పంట నష్టపోయి పరిహారం అందని 7,475 మంది రైతులకు రూ.61.74 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ పథకానికైనా అర్హులైన లబ్ధిదారులు పొరపాటున సొమ్ము జమకాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పథకాల ఫలాలు పొందని వారికోసం సంవత్సరంలో రెండు సార్లు తిరిగి దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర మేయర్ వసీం, జిల్లా గ్రంథాలయ ఛైర్‌పర్సన్ ఉమా మోహన్ రెడ్డి, ఆర్టీసీ రీజినల్ ఛైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, ఆన్సెట్ సీఈవో కేశవ నాయుడు, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని, జిల్లా బీసీ సంక్షేమ మరియు సాధికారత అధికారి ఖుష్బు కొఠారి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్, జిల్లా పశు సంవర్ధక అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

జిల్లా వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్‌గా కాగజ్‌ఘర్ రిజ్వాన్

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ ఆదేశాల మేరకు జిల్లా వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్‌గా కాగజ్ ఘర్ రిజ్వాన్ నియమిస్తూ రాష్ట్ర ఛైర్మన్ ఖాదర్‌బాషా మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. ముస్లింలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో సిఎం జగన్ తొలిసారి రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీలకు వక్ఫ్‌బోర్డ్ జిల్లా కమిటీలను నియమిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. దీంతో అనంతపురం నగరానికి చెందిన కాగజ్ ఘర్ రిజ్వాన్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్, అనంతపురం ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితోపాటు జిల్లా ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాపారు. రాష్ట్రంలో ముస్లింలకు సముచిత స్థానం అందించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. విద్యార్థి సంఘం నాయకుడిగా, విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, రాష్ట్ర మైనార్టీ అధ్యయన కమిటీ సభ్యుడిగా, వైసిపిలో ముఖ్యంగా వ్యవహరిస్తున్న తనకు అవకాశం దక్కడం గర్వకారణమన్నారు. సిఎం జగన్ ముస్లింల పక్షపాతిగా వ్యవహరిస్తూ ఆయన చేసిన ఎన్నో అభివృద్ధి పథకాలు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రిజ్వాన్

నార్పల కెజిబివిలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని కెజిబివిలో 9వ తరగతి చదువుతున్న శ్రీనిధి మరుగుదొడ్డిలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. నార్పలకు చెందిన వెంకటేష్ కూతురు శ్రీనిధి స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అయితే క్రిస్మస్ సెలవులు కావడంతో ఇంటికి వెళ్లిన శ్రీనిధి సోమవారం పాఠశాలకు రావాల్సి ఉంది. కానీ మంగళవారం సాయంత్రం రావడంతో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు మందలించడంతో మనస్థాపం చెందిన శ్రీనిధి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. వెంటనే సిబ్బంది అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పాఠశాల సిబ్బందిని వివరణ కోరగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటప్రసాద్ పాఠశాలకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇకపోతే నియోజకవర్గంలోని కేజీబీవీల్లో వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు కస్తూర్బా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుత పరిస్థితుల్లో పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన డైరీ, క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మంగళవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవాల్సిన విద్యారంగ సమస్యలు ఆర్థికపరమైన సమస్యలు చాలా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేసే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. అన్ని రకాల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, పోరాటాలు ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆ దిశగా సంఘాన్ని బలోపేతం చేసుకునే విధంగా మనమందరం పునరంకితం కావాలని అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా పనిచేస్తున్న యుటిఎఫ్ రాబోయే సంవత్సరానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడానికి ఉద్యోగ ఉపాధ్యాయులకు సక్రమంగా సమాచారాన్ని ఇవ్వడానికి డైరీ, క్యాలెండర్ దోహదపడతాయని తెలిపారు. చేపట్టబోయే ఉద్యమాలకు, ఉపాధ్యాయుల హక్కుల్ని కాపాడే బాధ్యతను ప్రతి ఉపాధ్యాయుడు తీసుకొని పాలకవర్గాల అణిచివేత విధానాన్ని ప్రశ్నించడంలో యుటిఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కులు సమస్యల పరిష్కారానికి ముందుకు వెళ్తున్న యుటిఎఫ్ క్యాలెండర్ డైరీ ఆవిష్కరించడం శుభ పరిణామం అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా డైరీని జీవో పుస్తకము ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా, ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు రమణయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, వేణుగోపాల్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు సుబ్బరాయుడు, కొండప్ప, శివప్రసాద్, రాజేంద్ర, చిట్టెప్ప, రాజు కుళ్లాయప్ప, గంగాధర్, పవన్, నాయుడు, హంద్రీ, చంద్రమోహన్, దస్తగిరి, ఆదిశేషప్ప తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు, తదితరులు

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి- అనంతపురం

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి కె.భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్పీ లో వివిధ పనులు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగాప్రజలు, ప్రజాప్రతినిధులు కార్యాలయంకు వస్తుంటారన్నారు. అయితే సిబ్బంది సమయపాలన పాటించక పోవడమేగాకుండా, అనుమతి లేకుండా సెలవులు పెడుతుండటంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున పై అధికారుల నుంచి ముందుగా అనుమతి పొందిన వారికే సెలవులు ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణ అధికారి జె.శ్రీనివాసులు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేడు ట్యాబ్‌లు పంపిణీ

నార్పల : మండల వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు స్థానిక బాలికల పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీపై బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, బాలికల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు నవీదా, పీడీలు శ్రీనివాసులు శ్రీదేవితో కలిసి చర్చించారు. మండల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

బెలుగుప్ప : విద్యార్థులు చదివితేనే బంగారు భవిష్యత్ సాధ్యమని ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో మండల విద్యాధికారి మల్లారెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 518 మంది 8వ తరగతి విద్యార్థులకు సిఎం జగన్ ట్యాబ్ అందజేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి సిఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భర్త త్రిలోక్‌నాథ్‌రెడ్డి, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, జి.శ్రీనివాసులు, కన్వీనర్ పాటిల్ శ్రీనివాసులు, రమేష్, నరిగన్న, కరుణాకర్, కస్తూరిబా పాఠశాల ఎస్ఓ మంజుల, వైసిపి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నార్పల : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్‌ఎస్‌డిసి) ఆధ్వర్యంలో రెండవ విడతలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆటోమేటివ్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, ఎపిఎస్‌ఎస్‌డిసి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే స్కిల్ హబ్ సెంటర్ ముఖ్య ఉద్యేశమన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఎంబిఎ, ఎంకాం చదివిన విద్యార్థులు అర్హులన్నారు. కావున జిల్లాలోని ఆసక్తి, శ్రద్ధ, ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెజిబివిల్లో సమస్యలు పరిష్కరించాలి

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యావంతుల వేదిక, అనంత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రామయ్య కాలనీలో ఉన్న రామకృష్ణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 62 కెజిబివి విద్యాలయాలు ఉన్నాయన్నారు. ఈ విద్యాలయాల్లో సరైన వసతులు, టీచింగ్-నాన్ టీచింగ్ పూర్తిస్థాయిలో లేవన్నారు. ముఖ్యంగా ఫుడ్ ఏజెన్సీ విషయంలో ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్లే ఎక్కువగా విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ఇందులో భాగంగానే శింగనమల కేజీబీవి విద్యాలయంలో నెలలోపు రెండుసార్లు ఫుడ్ పాయిజన్ దాదాపు వందమందికి పైగా విద్యార్థినులు ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్నారు. వెంటనే సంబంధిత విద్యాలయంలోని ఫుడ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీని భర్తీ చేయాలని, ఘటనకు కారాకులైన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో (ఎస్‌ఎస్‌ఎ) సర్వశిక్ష అభియాన్ కార్యాలయాన్ని నేడు ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి యువజన, ప్రజాసంఘాలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలం, పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్రప్రసాద్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఆర్‌సిసి రాష్ట్ర అధ్యక్షులు శివానంద, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ వెంకటేష్, అనంత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు సోమర రాహుల్, పిడిఎస్‌యు ఐటిఐ కళాశాల అధ్యక్షుడు వడ్డే శివ, ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు కుమార్, మాల మహానాడు టౌన్ ప్రెసిడెంట్ ఓబుళరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

వచ్చేఏడాది ఫిబ్రవరి 4న గుంతకల్లులో జరుగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో డివిజన్ కమిటీ ముఖ్య కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో వ్యతిరేకంగా పోరాడారన్నారు. అయితే తిరిగి వాటిని తీసుకొచ్చేందుకు కుట్ర జరుగుతోందన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసి, బీమా, బ్యాంకింగ్, రైల్వే, బొగ్గు గనులు, రక్షణ తదితర సంస్థలను ప్రయివేటీకరణ చేస్తుండడంతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందన్నారు. అంతేగాకుండా లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీ కంపెనీలకు కారుచౌకగా అమ్ముతుండడంతో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళుతోందన్నారు. మోడీ ఆర్థిక విధానాలన్నీ కార్పొరేట్, బహుళ జాతి కంపెనీలు, బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ మహాసభల్లో తీర్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, డివిజన్ కమిటీ అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు సత్తార్, జిలాన్, హనుమంతు, రామంజి, రఘు, గంగాధర్, గోపీ, కృష్ణ, రామంజి, అడవి రాముడు, షేక్షావలి, బాషా, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రం అందజేస్తున్న ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఆర్థిక అసమానతలను తొలగించడమే ధ్యేయం

ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించి ప్రతి ఇంటికీ సంపద చేర్చడమే ధ్యేయంగా సిఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారని ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం విడపనకల్ మండలం గడేకల్ పంచాయతీ పరిధిలోని ఎన్.తిమ్మాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పేర్కొన్నవిధంగా సామాజిక, ఆర్థిక సమానత్వాలు ప్రతి ఇంటికీ చేరినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అని భావించిని సిఎం జగన్ ఆ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మూడున్నరేళ్లలో దాదాపు రూ.1.60వేల కోట్లను పేదల ఖాతాల్లో దళారి వ్యవస్థ లేకుండా నేరుగా జమ చేశారన్నారు. ముఖ్యంగా రైతాంగ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇవన్నీ చూస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఏం చేయాలో దిక్కుతోచక అసహనంతో బహిరంగ సభల్లో నోరు జారుతూ అభాసుపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలో గెలిచి మరోసారి జగన్ సిఎం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ సమావేశాల్లో విభజన చట్టం, సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, కడప స్టీల్ ప్లాంట్ ఫ్లాంట్ ఫ్యాక్టరీ తదితర అంశాలపై గట్టిగా వాదన వినిపించినట్లు తెలిపారు. అనంతరం మండలంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి బీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ బ్రహ్మయ్య, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోవిందరెడ్డి, ఎంపిటిసి ఓబులేసు, ఉపసర్పంచి పార్వతి, మండల కన్వీనర్ బసన్న, వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, విడపనకల్ పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, నాయకులు ఉమాశంకర్, హంపయ్య, అశోక్‌రెడ్డి, రాము, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక కోర్టురోడ్డులోని శ్రీచైతన్యలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఉత్సవ్ ఆదర్శ్, బాలిక విభాగంలో 7వ తరగతి విద్యార్థిని బళ్లారి హిమ వర్షిని అండర్-17 బాలుర విభాగంలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎజిఎం సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తబస్సు, పీఈటీలు హసేన్, సురేష్, డీన్లు రిషిబాల, అప్పలనాయుడు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏవో గోపాల్, తదితరులు అభినందించారు.

29న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 29న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం గుత్తి నుంచి చేపట్టిన పాదయాత్ర 29న కలెక్టరేట్ చేరుకుంటుందన్నారు. దీంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే పాదయాత్రకు అనంతపురం నగరం, రూరల్ కాలనీల్లోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతపురం నగరం, రూరల్ కాలనీల్లో నివశిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. శ్రీశ్రీ నగర్, నవయుగ కాలనీ, దర్గా కొట్టాలు, అభ్యుదయ కాలనీ, గణేనాయక్ కాలనీ, 15 ఏళ్లుగా గుడెసెలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. గతంలో కొన్ని కాలనీల్లో కొందరికి ఇంటి పట్టాలు ఇచ్చి, మరి కొందరికి మరలా ఇస్తామని హామి ఇచ్చి సంవత్సరాలు కావస్తున్న ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. అందులో గణేనాయక్ కాలనీ, లీలా సుందరయ్య కాలనీ, మహదేవనగర్, ప్రజా చైతన్య కాలనీ, జ్యోతిబసు కాలనీ, ఆటో కాలనీల్లో వందల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చిన స్పందన లేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే నిర్వహిస్తున్న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు

అధికార పార్టీ నాయకుల నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల అధికార పార్టీ నాయకుల అండతో కొందరు గుడి, బడి స్థలాలు, పేదలు సాగు చేసుకుంటున్న భూములు, శ్మశాన స్థలాలను ఆక్రమించుకున్నారన్నారు. వీరికి రెవెన్యూ అధికారులు సైతం మూమూళ్ల మత్తులో జోగుతూ వత్తాసు పలకడం బాధాకరమన్నారు. ఇందులో భాగంగానే మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో శ్మశాన స్థలాన్ని ఆక్రమించారన్నారు. స్థలాన్ని కావాడాలని స్థానికులు అధికారులకు విన్నవించినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ, శ్మశాన స్థలాలను కాపాడకపోతే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి బి.భాస్కరరెడ్డి, సిపిఎం నాయకులు ఎల్లుట్ల తల్లారి ఓబుళయ్య, కెవిపిఎస్ నాయకులు నాగభూషణం, నాగమునేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శనగలో మొదలు కుళ్లు రాకుండా చూసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మాట్లాడుతున్న ఎఒ సరిత

రబీ సీజన్‌లో నల్లరేగిడి భూముల్లో సాగు చేసిన శెనగ రైతులు మొదలు కుళ్ల సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఎఒ సరిత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పడమటి కోడిపల్లి, గొల్లలదొడ్డి, పోలేపల్లి పొబ్బర్లపల్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన శనగ పంటను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లరేగడి భూముల్లో సాగుచేసిన శెనగ పంటకు వేరుకుళ్ల సోకకుండా మూడు గ్రాముల మాంకోజెబ్, 2 గ్రాముల కార్బెండాజిమ్‌ను ఒక లీటరునీటికి కలుపుకుని మొదళ్లతడిచేలాగా బాగా పిచికారి చేయాలన్నారు. తద్వారా వేరు బలంగా ఉండి శనగ పంటలో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

ఎస్ఎస్ఎ అధికారులపై చర్యలు తీసుకోవాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శింగనమల కెజిబివి పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు కారకులైన సిబ్బందిని, ఎస్ఎస్‌ఎ అధికారులను సస్పెండ్ చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం, జిల్లా అధ్యక్షులు ధనుంజయ నా యుడు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం టిఎన్ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గేటు ఎదుట రోడ్డుపై బైటాయించి ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. నెల గడవకముందే రెండవసారి శింగనమల కేజీబీవీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ సంఘటన చోటు చేసుకోవడం ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు చేపట్టడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. జిల్లాలోని కెజిబివిలు, మోడల్‌స్కూల్, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్, శ్రీనివాసులు, సురేష్, భరత్ చౌదరి, సాదిక్, మంజు, ఓబు లేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంత జెఎన్‌టియును అగ్రగామిగా నిలుపుదాం..

ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ విద్యాసంస్థల ర్యాంకింగ్‌లో అనంత జెఎన్‌టియును అగ్రభాగాన నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపకులపతి రంగజనార్ధన పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వర్సిటీ పరిపాలన భవనం కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ విద్యాసంస్థలు ర్యాంకింగు ఫ్రేమ్ వర్క్‌పై విసి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రతి అధ్యాపకుడి కృషితోనే మెరుగైన ర్యాకింగ్ సాధ్యమన్నారు. కావున ప్రతి అధ్యాపకుడు మరిన్ని పేటెంట్స్ పొందేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వర్సిటీ వనరులను పెంపొందించు కోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ ర్యాంకింగ్స్ వందలోపు సాధిస్తే అనేక లాభాలు ఉంటాయన్నారు. విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి కె.బాలవీరారెడ్డి జాతీయ ర్యాంకింగ్స్ ఎలా పొందాలా.. ఎలా అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలను వివరించారు. ముఖ్యంగా ర్యాంకింగ్స్‌లో ఐదు అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీలు టీచింగ్ లెర్నింగ్, రీసోర్స్, రీసెర్చ్, ప్రొఫెషనల్ ప్రాక్టీస్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యకమంలో వర్సిటీ రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్ సుబ్బారెడ్డి, అకాడమీ డైరెక్టర్ వి.సుమలత, డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ భవానీ, విభాగం అధిపతులు, అనంతపురం, పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాలల కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్పంచులను ఆటబొమ్మలుగా మార్చొద్దు..

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో ఉన్న సర్పంచులను ఆటబొమ్మలుగా మార్చొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యుడు డేగల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచులు, ఎంపిటిసిలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. సర్పంచులకు ఇచ్చిన రూ.8,660 కోట్ల నిధులను తిరిగి సర్పంచుల ఖాతాలకు మళ్లించాలని డిమాండ్ చేశారు. అలాగే గౌరవ వేతనం రూ.15వేలు ఇవ్వాలని, పాత పద్ధతిలోనే విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని, సచివాలయాలకు ఇస్తున్న రూ.20 లక్షల నిధులను ఎమ్మెల్యేలకు కాకుండా సర్పంచుల ఆధ్వర్యంలో పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా నుంచి మట్లగుంది సర్పంచి గాండ్ల రమేష్, గుమ్మేపల్లి సర్పంచి డేగల లలితమ్మ, వెంకటాపురం సర్పంచి వసంత్‌కుమార్, ముత్యాలప్ప, చంద్రశేఖర్, కుమార్, అశోక్, జనార్దన్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో చేపట్టిన అర్బన్‌హెల్త్ సెంటర్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని కమిషనర్ భాగ్యలక్ష్మి అన్నారు. ఈమేరకు మంగళవారం నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న హెల్త్‌సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం కమలానగర్‌లో రోడ్లపై చెత్తాచెదారం వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ కార్మికులను పిలిపించి రోడ్లను శుభ్రం చేయించారు. అక్కడే ఉన్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో వైద్యం అందించేందుకు అర్బన్‌హెల్త్ సెంటర్లను ప్రారంభించినట్టు తెలిపారు. దీంతో నగరంలోని అన్ని ప్రాంతాల్లో వీటికి నిర్మాణం వేగంగా సాగుతున్నాయన్నారు. మరోవైపు రోడ్లపై ఇప్పటికీ చెత్తా చెదారం వేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సరైన చర్య కాదన్నారు, సంబంధిత వార్డు కార్యదర్శులు ప్రజలు, షాపు యజమానులకు అవగాహనా కలిపిస్తూ, చెత్తను రోడ్డు, కాలువలపై వేయకుండా చెర్యలు ముమ్మరం చేయాలనీ ఆదేశించారు.

రేషన్ దుకాణం తనిఖీ

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి శోభారాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ సరుకుల తూకాల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. వేలిముద్రలు పడని వృద్ధుల కార్డుల వివరాలను డీఎస్ఓ కార్యాలయాన్ని పంపాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తమశీల్దార్ షర్మిల, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

విఆర్‌కు యాడికి ఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి : యాడికి ఎస్ఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును ఉన్నతాధికారులు విఆర్‌కు పంపినట్లు పామిడి రూరల్ సిఐ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన కారణాలతో విఆర్‌కు పంపినట్లు తెలిపారు. దీంతో యాడికి ఇన్‌ఛార్జి ఎస్ఐగా పెద్దవడుగురు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

సిఎంను కలిసిన మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గుత్తికి చెందిన కె.మధుసూదన్‌రెడ్డి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సిఎం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సిఎంతో మాట్లాడుతున్న కె.మధుసూదన్‌రెడ్డి

సాయిట్రస్టు ఆధ్వర్యంలో దహన సంస్కారాలు

ప్రజాశక్తి-అనంతపురం

వివిధ కారణాలతో మృతిచెందిన ఐదుగురికి సాయిట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం దహన సంస్కారాలు నిర్వహించారు. వేర్వేరు కారణాలతో ఐదుగురు మృతిచెందడంతో వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు బంధువులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అందిన సమాచారం మేరకు సాయి ట్రస్టు సభ్యులు వారిని వివిధ శ్మశానాల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిట్రస్టు సభ్యులు నారాయణనాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

శింగనమల : నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, భర్త, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం జగన్‌ను కలిసి విన్నవించారు. ముఖ్యంగా ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లికి సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు, ఈస్ట్ నరసాపురంలో బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు భవనాలు, యల్లనూరు వద్ద ఉన్న చిత్రావతి నదిపై, సింగవరం వద్ద, శింగనమల మరువ వద్ద, బుక్కరాయసముద్ర ం మరువ వద్ద బ్రిడ్జిలు నిర్మించాలని, శింగనమల, పుట్లూర పోలీస్ సర్కిల్ కార్యాలయా లకు బిల్డింగులు, నియోజకవర్గంలో ఇప్పటికే పట్టాలిచ్చిన వాటికి గృహాలు మంజూరు చేయాలని, శింగనమల చెరువు పాత మరవ నుంచి బస్టాండ్ వరకు డబుల్ రోడ్డు, శింగనమల, సోదనపల్లి, యల్లనూరుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు నిధులు కేటాయిం చాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సిఎం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి గారి మొబైల్ కోర్టు, అనంతపురము
ఓ.ఎస్. నెం. 388/2020

మధ్యలో

ఎస్. వసంత మరియు ముగ్గురు ...వాది

మరియు

తహశీల్దారు, అనంతపురము మరియు 19 మంది ఇతరులు ...ప్రతివాదులు

కోర్టు వారి ఉత్తర్వు ప్రకటన

కక్కలపల్లి గ్రామం, అనంతపురము రూరల్ సర్వే నెం. 21, ప్లాటు నెంబర్లు 22, 29 విస్తీర్ణం 5+5=10 సెంట్లు గల హోస్ సైట్ ప్లాట్స్ గౌరవనీయులైన పైన తెల్పిన మొబైల్ కోర్టు, అనంతపురము నందు ఒక డిక్లరేషన్ దావా (ఓ.ఎస్. నెం. 388/2020) గా పెండింగ్‌లో కలదు. పై కేసులో ప్రతివాది అయిన

ప్రతివాది నెం. 19 దూదేకుల ఖైరున్‌బీ, భర్త : డి. షరీఫ్, వయస్సు 35సం॥రాలు, కూలీ, నివాసం ఇంద్రజిత్‌కాలనీ, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజ్ ఎదురుగా, కక్కలపల్లి కాలనీ, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురము రూరల్ మండలం మరియు జిల్లా.

పైన తెల్పిన ప్రతివాది నెం. 19 అయిన మీరు కోర్టు నుంచి కేసు కాగితాలు అనేక పర్యాయములు కోర్టు వారు పంపుతున్నా, మీరు సదరు పైన తెల్పిన కోర్టు వారి ఎదుట హాజరు అవ్వడం లేదు. అలాగే మీరు పై కేసు నందు ఎటువంటి ఆక్షేపణలు దాఖలు చేయడం లేదు. మీ హాజరు మరియు మీ ఆక్షేపణలు దాఖలు చేయు నిమిత్తము వాదికి (ఎస్. వసంత మరియు ముగ్గురు, అను వీరికి) కోర్టు వారు కోర్టు నోటీసులను అనంతపురము జిల్లా ప్రజాశక్తి న్యూస్ పేపర్ ద్వారా మీకు పంపుటకు వాదికి కోర్టు వారు ఆజ్ఞాపించడం అయినది.

కావున పై కేసులో గల ప్రతివాది నెం. 19 గారు గౌరవనీయులైన పై కోర్టు నందు పైన తెలిపిన డిక్లరేషన్ దావా తదుపరి వాయిదా 09-01-2023 నాడు వున్నది. మీరు ఆ దినమున ఖుద్దున గాని, లేదా మీ తరపున వకీలును గాని ఏర్పాటు చేసుకొని, గౌరవనీయులైన పై కోర్టు నందు తదుపరి వాయిదా అయిన 09-01-2023 నాడు ఉదయం 10.30గ॥లకు హాజరై మీ ఆక్షేపణలు, అభ్యంతరములను కోర్టు వారికి తెలుపుకోగలరు. ఒక వేళ మీరు హాజరు కాని పక్షములో కోర్టువారు మీ పరోక్షమున తీర్మాణము చేయుదురు.

Plaint "A" Schedule property.

Property situated in Kakkalapalli village polam, in Anantapuramu rural and Mandal, withint he RD and SRD of Anantapuramu rural and dist.

Sarkaru Kushki,	Sy.No:	A. C.	H.S.	Plot No:
	21	0.05 cents	0.020	29.

Bounded by:
East: Plot No; 33, West : Plot No: 25, South: Gondhi Pullaiah's wife land. North: 30 feet road.
Measurements:
East to west: 36 feet or 10.97 meters, North to Sough: 60 feet or 18.29 meters.
Plaint "B" Schedule property.
Property situated in Kakkalapalli village polam, in Anantapuramu rural and Mandal, withint he RD and SRD of Anantapuramu rural and dist.

Sarkaru Kushki,	Sy.No:	A. C.	H.S.	Plot No:
	21	0.05 cents	0.020	22.

Bounded by: East: Plot No; 26, West : Plot No: 18, South: 30 feet road. North: Lingappa's land.
Measurements: East to west: 36 feet or 10.97 meters,
North to Sough: 60 feet or 18.29 meters.

ఈ ప్రకటన కోర్టు వారి ఉత్తర్వు మేరకు

ఇట్లు, (ఎస్. సుబ్రమణ్యం), వాదిపరం వకీలు. అనంతపురము, సెల్ నెం.94400 17703.

అనంతపురము II జూనియర్ సివిల్ జడ్జి (మోబైల్ జడ్జి) గారి కోర్టులో
EP:251/2021 O.S.687/2018

Between:
ఎ.హరి (Died) rep to by LRs ...D.Hrs/వాదులు

ఎదిరి

ఎం.రఘునాథ చౌదరి తండ్రి:ఎం.శ్రీరాములు, బొందలవాడ గ్రామం, నార్పల మండలం, అనంతపురం జిల్లా. ...ప్రతివాది

పై దావాలో ప్రతివాది అయిన ఎం.రఘునాథ చౌదరి అను నతడు పై కోర్టు వారి యెదుట 30-12-2022 లేదిన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కాని యెడల సదరు ప్రతివాదిని ఎక్స్‌పార్టీ చేసి అతను పరోక్షమున పై దావా తీర్మానించెదరు ఈ సంగతి యావన్మందికి తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎం.ఎ. నాగేశ్వరి
వాదుల పరం వకీలు

శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం
1వ రోడ్డు, అనంతపురం

తేది:28-12-2022

కొటేషన్ స్వీకరణ

సదరు పై దేవస్థానం నందు మహాశివరాత్రి బ్రహోత్సవాల సందర్భంగా దేవాలయానికి పెయింటింగ్, సున్నం పూయుట, లైటింగ్ డెకరేషన్, పూల డెకరేషన్, క్యూలైన్ నిర్మాణం, సప్లయర్ సామానులు సరఫరా చేయుట, దేవస్థాన ఆవరణంలో తాత్కాలిక మరమ్మత్తులు, సిసి కెమెరా పనులు చేయుటకు, దేవస్థానంలో ఎల్‌ఈడి టీవీలు ఏర్పాటు చేయుట మొదలగు పనులకు ఆసక్తి గల వారి నుంచి కొటేషన్‌లు స్వీకరించుటకు ఆహ్వానించడమైనది. సదరు పనుల వివరాలను కార్యాలయం నుంచి తెలుసుకొని 4 రోజుల లోపల కొటేషన్‌లు అందజేయవలెనని కోరడమైనది.

ఛైర్మన్ మరియు సభ్యులు

సం/- బి.సుధారాణి
కార్యనిర్వహణాధికారి
శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాయలయం
1వ రోడ్డు, అనంతపురం.

నగరంలో అభివృద్ధి శూన్యం

అనంతపురం కలెక్టరేట్ : నగరంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని మాజీ ఎమ్మెల్యే, టిడిపి అర్బన్ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. మంగళవారం నగరంలోని 27వ డివిజన్‌లో ఉన్న రంగస్వామి నగర్‌లో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పట్టాలిస్తామని వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని ప్రజలు ఆరోపించారు. మరువంక సైడ్ వాల్ కల్వర్టు నిర్మించి ఇల్లు మునగకుండా కాపాడాలని, ఇటీవల ఇల్లు మొత్తం మునిగిపోయాయని ప్రజలు వేడుకొన్నారు. ఇల్లు మునిగిపోయిన ప్రభుత్వం ఏమాత్రం సహాయం చేయలేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతీ కుమార్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, దేవర్లమురళీ, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్, కూచి హరి, జిల్లా టియన్‌టియుసి అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నగర మహిళా అద్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, రాష్ట్ర కురబ యాదవ సమన్వయకర్త శివబాల పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన పాలకులు : మాజీమంత్రి శైలజానాథ్

ప్రజాశక్తి-నార్పల

అభివృద్ధి అంటే పాలకులు సంపాందించుకోవడం కాదని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం అని మాజీమంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అర్ధాంతరంగా ఆగిన కూతలేరు నదిపై ఉన్న వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం తాను మంత్రిగా ఉన్న సమయంలో రూ.2కోట్ల నిధులు విడుదల చేసి కూతలేరు బ్రిడ్జి పనులను ప్రారంభిస్తే ఇప్పటికీ పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. దీనిబట్టి చూస్తే ప్రస్తుత పాలకుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు నిస్వార్థంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ప్రస్తుత పాలకుల దృష్టిలో అభివృద్ధి అంటే కేవలం ఇసుక, కొండలు, కమీషన్లు, వర్గపోరులే అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి ఎన్నోసార్లు సిఎం జగన్‌ను కలిసి ఉంటారని, కలిసినప్పుడు కేవలం సొంత పనులపై కలవడం వల్లే నియోజవర్గానికి ఈ పరిస్థితి దాపురించిందన్నారు. అనంతరం బండ్లపల్లి గ్రామానికి వెళ్లి పార్టీలకతీతంగా పలువురు నాయకులతో కలిసి సంప్రదింపులు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ్లపల్లి ప్రతాపరెడ్డి, దాదాగాంధీ, పూల ప్రసాద్, ఆకుల విజయ్‌కుమార్(బాబు), ఆకుల కిశోర్, టైలర్ బాషా, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.